# రసమయిని గెలిపించండి.. కేసీఆర్‌ను దీవించండి



ఇల్లంతకుంట బహిరంగ సభలో అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

- భారీ మెజారిటీతో మరోసారి గెలిపించండి
- పదేండ్ల కింద తెలంగాణ ఎట్లుండె.. ● ఇప్పుడెట్లయిందో చూసి ఓటేయండి
- మండుటెండల్లో వాగులు, వంకలను పారించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే ● నాడు పనికోసం పాకులాట.. నేడు కూలీల కొరత
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) / ఇల్లంతకుంట : మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించారు. '40 ఏండ్లు కాంగ్రెస్, నడిమిట్ల తెలుగుదేశపోళ్లు.. వాళ్లు పోయి వీళ్లువచ్చినా.. వీళ్లు పోయి వాళ్లచ్చినా తాగడానికి నీళ్లు కూడా ఇవ్వలేదు' అని విమర్శించారు. ఎడకాలం వచ్చిందంటే బాయిల కాడికెళ్లి నీళ్లు మోసుకున్నామని, బోరింగులు కొట్టి నీళ్లు తెచ్చుకున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని గుర్తు చేశారు. తాగునీళ్లకే ఇబ్బంది పడ్డ ఈప్రాంతం ఇవాళ్ల సస్యశ్యామలమైందన్నారు. తాగునీటితో పాటు సాగునీరు తెచ్చుకున్నామని, నీళ్ల కష్టం తీరిందన్నారు. ఎదిగిన బిడ్డ పెండ్లి చేయాలన్న తల్లి బాధను గుర్తించిన కేసీఆర్ మనుసు పెట్టి ఎవరు అడగకున్నా, ఎన్నికల కోసం ఓట్ల ముందు చెప్పకుండానే కల్యాణలక్ష్మితో రూ.లక్షా నూట పదహార్ల ఆర్థిక సహాయం చేశారని చెప్పారు. కులాలు, మతాలు, రాజకీయాలని చూడకుండా 12.70 లక్షల మంది ఆడబిడ్డలకు సాయం చేసినట్లు తెలిపారు. గతంలో ప్రైవేటు దవాఖానలో కాన్పు కావాలంటే రూ.50 వేలకు పైగా ఖర్చు అయ్యేదని, సర్కారులో కాన్పులు చూసి ప్రైవేటోళ్లంతా ఎట్ల బతకాలి? అని అడుగుతున్నారని చెప్పారు. అమ్మ ఒడి, న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లతో ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల శాతం పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 30 శాతం సర్కారు దవఖానలో ప్రసవాలు అయితే, 70 శాతం ప్రైవేటులో జరిగేవని, ఆ పరిస్థితి నేడు ఉల్టా అయిందన్నారు. కాంగ్రెస్ కాలంలో ఆడపిల్లల చదువులకు కాలేజీలు లేక, చదువుకొనలేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ 78 మహిళా రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి, ఆడపిల్లలు ఉన్నత చదువులకు ఎదిగేలా చేశారన్నారు. మంచినీళ్లు కావాలంటే అక్కాచెల్లెళ్లు పడ్డ కష్టాలు వర్ణణాతీతమన్నారు. ఎమ్మెల్యే ఏఊరికి పోవాలన్నా ముందు పోలీస్ బండి, లేదా బోరు బండైనా పోవాల్సిన పరిస్థితి నాడు ఉండేదని, బిందెలు అడ్డంగా పెట్టి ధర్నాలు చేసిన రోజును ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇయ్యాళ ఆ పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఇంటింటికీ నల్లా ఇచ్చి అక్కాచెల్లెళ్ల కష్టాలను తీర్చారని చెప్పారు. ఇల్లంతకుంట మండలంలో నాటి కరువు పరిస్థితిలో కైకిలు దొరకని పరిస్థితి ఉంటే.. నేడు కాళేశ్వర జలాలతో సాగు విస్తీర్ణం పెరిగి కైకిలోళ్లు దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. పక్క రాష్ట్రం నుంచి కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారని, పదిమందికి ఉపాధి కల్పించడమే కాకుండా కడుపు నిండా తిండి పెట్టే పరిస్థితి వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఎట్లుండేదో.. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలా అయ్యిందో ఇదే నిదర్శనమన్నారు. చెరువులు ఎండి పోయి మత్స్య కార్మికుల ఉపాధి కోల్పోతే.. స్వరాష్ట్రంలో చెరువులు నింపి చేపల పెంపకంతో వారి వృత్తిని బలోపేతం చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. కేసీఆర్ వల్లే కావాల్సినంత కరెంటు వచ్చిందని, రెండు పంటలు పండుతున్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో ఉచిత కరెంటని ఉత్త కరెంటు చేశారని విమర్శించారు. ఒకప్పుడు ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ముందు ఒక్క ఎరువుల సంచి కోసం పొద్దుగాల లైను కడితే పొద్దగూకినంక సంచి దొరికేదన్నారు. ఇయ్యాల ఎరువులకు ఇబ్బందులు లేవని, పెట్టుబడికి రూ.పదివేల సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వమని చెప్పారు. పంట పండితే చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొని వారంలోగా నగదు నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నదని తెలిపారు. ఒక్కో అడుగు వేసుకుంటూ ఎదుగుతున్న సమయంలో తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటేస్తే పెద్ద పాము మింగినట్లు తెలంగాణ బతుకులు ఆగమైతాయని హెచ్చరించారు. అన్నీ అబద్ధాలు చెపుతారని, గతంలో ఇదే కాంగ్రెస్సోళ్లు చెప్పిన మాయమాటలను మరిచి పోవద్దని కోరారు. తాండాలను గ్రామ పంచాయతీలు చేస్తామని, ఆరుకిలోల బియ్యం ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. కేసీఆర్ మాట తప్పలేదని, అడగకుండానే పథకాలు ఇచ్చిన నాయకుడన్నారు. సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట, సిరిసిల్లకు రోడ్లు వేశామని, దవాఖానలను బాగు చేసుకుంటున్నామని, అన్ని గ్రామాల్లోని కులసంఘాలు, మహిళా సంఘాలకు నిధులు ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఓడెక్కినంక ఓడ మల్లన్న, ఒడ్డు దాటినంక బోడ మల్లప్ప అన్న చందంగా కాంగ్రెసోళ్ల కథ ఉంటందన్నారు. తిన్న రేవును తలవాలని పెద్దలు చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ అన్ని విధాలుగా ధైర్యమిస్తున్న కేసీఆర్‌కు అండగా ఉండి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని, మీ ఆశీర్వాదం ఉండాలని కోరారు.

### ఎమ్మెల్యే రసమయిపై ప్రశంసలు

మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను మంత్రి ప్రశంసించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి కోసం పట్టిన పట్టు విడవకుండా పని పూర్తయ్యే వరకు విశ్రమించబోరని చెప్పారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో 30 పడకల దవాఖాన కావాలని రసమయితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ పట్టుబట్టినట్లు గుర్తు చేశారు. దగ్గరలోనే సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్‌లో మెడికల్ కళాశాలలు, పెద్ద దవఖానలు ఉండగా ఇక్కడ దవాఖాన ఎందుకన్నానని, మండల ప్రజల కోసం దవాఖాన తప్పనిసరి కావాలని ఇద్దరూ ఒత్తిడి తెస్తే అందుకు తాను 50 పడకల దవాఖానను మంజూరు చేసినట్లు చెప్పారు. నిజంగా ఇల్లంతకుంటకు ఇది శుభదినమన్నారు. ఇప్పటి వరకు ఇల్లంతకుంటలో ఆరు పడకల దవాఖాన మాత్రమే ఉండేదని, కొత్తగా 50 పడకల దవాఖానతో ఇక్కడి గర్భిణులకు కాన్పులు ఇక్కడే చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏ ఆపదొచ్చినా పేదలకు మెరుగైన వైద్యం అందేలా రూ.17 కోట్లతో దవాఖానకు శంకుస్థాపన చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇల్లంతకుంట ప్రజలకు సేవలు చేసుకునే భాగ్యం పెద్దమ్మతల్లి, ఎల్లమ్మతల్లి, ఆ బీరప్పదేవుడిచ్చాడన్నారు. తనకెంతో సంతోషంగా ఉందని, ఆరోజు నీళ్ల మంత్రిగా నీళ్లిచ్చే అదృష్టం కలిగిందని, నేడు వైద్య మంత్రిగా దవాఖాన తెచ్చిన అదృష్టం తనకు దొరికినందుకు సంతోషిస్తున్నానన్నారు. ఇల్లంతకుంట.. సిద్దిపేట వేరు కాదని, ఇక్కడి ప్రజలు పడ్డ కష్టాలే తామూ పడ్డామని చెప్పారు. ఇల్లంతకుంట, సిద్దిపేటకు చాలా దగ్గర సంబంధం ఉంటదని, పిల్లను తెచ్చుకుంటరు.. పిల్లను ఇస్తరని మంత్రి పేర్కొన్నారు. అటు కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట మూడింటి మధ్య ఇల్లంతకుంట ఉందన్నారు. ఈ మండలంలోని కొన్ని ఊర్లు సిరిసిల్ల, కొన్ని ఊర్లు కరీంగనర్, మరి కొన్ని ఊర్లు సిద్దిపేటకు కలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సుడా చైర్మన్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

### మండుటెండలో వాగులు పారించినం

మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్టుతో వాగులు, వంకలను పారించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుంది. పదేళ్ల కిందట సాగు నీరు లేక ప్రజలు కూలీ కోసం కష్ట పడే రోజులు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఎడారి భూములను పచ్చని పంట పొలాలుగా మార్చారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తున్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు మూడోసారి ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించండి.ఇతర పార్టీలకు ఓటు వేసి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టవద్దు. రాష్ట్రం పచ్చని పంట పొలాలతో అందరూ సంతోషంగా ఉండాలంటే తప్పకుండా బీఆర్‌ఎస్‌ను గెలిపించండి.

-డాక్టర్ రసమయి బాలకిషన్,
మానకొండూర్ ఎమ్మెల్యే

# వలసజీవికి విముక్తి

- 17 ఏండ్ల తర్వాత సొంతగూటికి
- మంత్రి కేటీఆర్ చొరవతో దుబాయ్ జైలు నుంచి విడుదల
- స్వగ్రామం కోనరావుపేటకు చేరిన లక్ష్మణ్
- భావోద్వేగానికి గురైన కుటుంబసభ్యులు

కోనరావుపేట, అక్టోబర్ 10: ఉపాధి వేటలో దుబాయ్ బాట పట్టిన యువకుడు ఓ హత్య కేసులో చిక్కుకొని 17 ఏండ్లు జైలు శిక్ష అనుభవించాడు. మంత్రి కేటీఆర్ చొరవతో ఎట్టకేలకు ఇంటికి చేరాడు. కొడుకును చూసి తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు..'బతికొస్తవానుకోలేదు కొడుకా..నీ పాణం ఎట్లున్నది బిడ్డా' అంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. వివరాలు.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన దండుగుల నర్సయ్య, లస్మవ్వకు ఇద్దరు కొడుకులు రాజు, లక్ష్మణ్(43), కూతుర్లు లక్ష్మి, రేణుక. లక్ష్మణ్ ఉపాధి కోసం 2004లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ నేపాల్‌కు చెందిన ఓ సెక్యూరిటీకి చెందిన హత్య కేసులో ఇరుక్కుపోయి జైలుకు వెళ్లాడు. ఇతడితో పాటు సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన శివరాత్రి రవి, శివరాత్రి మల్లేశ్, శివరాత్రి హనుమంతు, గొల్లె నాంపెల్లి మరో నలుగురు శిక్ష అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో మంత్రి కేటీఆర్ దుబాయ్‌లో బాధితుల వద్దకు వెళ్లి క్షమాభిక్ష కోసం షరియా చట్ట ప్రకారం రూ.15 లక్షలు చెల్లించారు. నేరం తీవ్రత దృష్ట్యా అక్కడి అధికారులు వీరిని విడుదల చేయలేదు. ఇటీవల మంత్రి కేటీఆర్ స్వయంగా దుబాయ్ దేశం వెళ్లి అక్కడి అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడారు. ఇందులో కోనరావుపేటకు చెందిన లక్ష్మణ్ ఆనారోగ్యంతో పాటు తదితర కారాణాల రీత్యా న్యాయవాది అభ్యర్థన మేరకు విడుదలకు ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం ఇండియన్ ఎంబసి అధికారులు స్వయంగా హైదరాబాద్‌లో లక్ష్మణ్‌ను తన కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మణ్ చూసి కుటుంబ సభ్యులు కన్నీపర్యంతమయ్యారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న లక్ష్మణ్ సురక్షితంగా ఇంటికి చేరాడు. తన తల్లి లస్మవ్వను చూసి అవ్వ నేను ఇంటికి వస్తానో లేదో అని కంటతడిపెట్టాడు. మంత్రి కేటీఆర్ దేవుడిలా వచ్చి లక్ష్మణ్‌ను ఇంటికి చేర్చడని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులకు లక్ష్మణ్‌ను అప్పగిస్తున్న అంబాసిస్ అధికారులు



కుటుంబ సభ్యులతో లక్ష్మణ్

### కేటీఆర్ సారు సల్లాంగుండాలి

మా ఇంటికి దేవుడిలా కేటీఆర్ నిలిచిండు. సారు సల్లాంగుండాలి.17 ఏండ్లుగా ఇల్లు విడిచి వెళ్లిన నా కొడుకు ఇంటికి వత్తడని అనుకోలేదు. నా భర్త నర్సయ్య కొడుకు రందీతో ఆనారోగ్యంతో చనిపోయాడు. ఇక నేను కూడా పాణం బాగలేక దవాఖన్ల సుట్టూ తిరుగుతున్నా. ఇక ఇంటికి రాడోమోనని అనుకున్నా. దుబాయ్‌లోనే నా కొడుకు ఉండిపోతుడని రందితో ఉన్నా. కానీ కేటీఆర్ సారూ పైసలు కట్టి ఇంటికి తేచ్చిండు. సారూను నా కుటుంబానికి దేవుడిగా పంపించిండు. సారూకు రుణపడి ఉంటా.

-లస్మవ్వ, లక్ష్మణ్ తల్లి

### కేటీఆర్ సారువల్లే ఇంటికొచ్చిన

నేను చిన్న వయసులోనే ఆనాడు ఇంటికాడా పనిలేకుంటే ఉపాధి కోసమని దుబాయ్‌కి వెళ్లినా. కానీ పోయినంక మంచిగానే పని చేసుకుంటున్నా. కానీ రాత్రికిరాత్రచ్చి అక్కడి పోలీసులు హత్య కేసులో ఆరెస్టు చేసిండ్రు. ఇగ ఏమైందో తెలువది. అక్కడ జైలులో పడేసిండ్రు. నాతో పాటు నారూమ్‌లో ఉన్న అందరినీ తీసుపోయిండ్రు. 17 ఏండ్లుగా జైలులోనే జీవితం ఎల్లాదీసినా. కానీ మంత్రి కేటీఆర్ సారూ అక్కడ పైసలు కట్టి ఇట్టికి తెప్పించిండ్రు. నాకు ప్రాణభిక్ష పెట్టిన కేటీఆర్ సారూకు కృతజ్ఞతలు..

- దండుగుల లక్ష్మణ్